క్లుప్తంగా

దాతల సాయం అభినందనీయం



పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): హెచ్ఐవీ బాధితులకు దాతల సాయం అభినందనీయమని ఏఆర్‌టీ సెంటర్ వైద్యుడు డాక్టర్ గోవిందబాబు అన్నారు. పాజిటివ్ పీపుల్ సొసైటీ వారి ఆధ్వర్యంలో హెచ్ఐవీతో చనిపోయిన వారి జ్ఞాపకార్థం కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. అనంతరం దాతల సాయంతో హెచ్ఐవీ బాధితులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో కముజు శ్రీనివాసరావు, పి.శేషారాజ్యం, పి.వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేడు వేండ్రలో గడపగడపకు మన ప్రభుత్వం

పాలకోడేరు: మండలంలోని వేండ్ర గ్రామంలో సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ భూపతి రాజు చంటి రాజు తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సోమవారం ఉదయం 7 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమానికి నాయకులు కార్యకర్తలు ఉద్యోగులు వలంటీర్లు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

నేడు విద్యార్థులకు సత్కారం

ఉండి: పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ఉండి జెడ్పీ హైస్కూల్లో సోమవారం అభినందన సత్కార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు హెచ్ఎం బీబీ తెలిపారు. ఉదయం 9 గంటల నిర్వహించే ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు, పేరెంట్స్ కమిటీ, నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొంటారని ఆమె తెలిపారు. అలాగే ఉండి జెడ్పీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన జూనియర్ కళాశాలలో తల్లిదండ్రులంతా మీ పిల్లలను చేర్పించాలంటూ హెచ్ఎం కోరారు.

మహిళలకు కుట్టు శిక్షణ శిబిరం

పాలకొల్లు అర్బన్: మండలంలోని శివదేవునిచిక్కాల శ్రీ రాఘవేంద్ర ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మహిళలకు కుట్టు శిక్షణ ఇవ్వనున్నట్లు ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు నిమ్మల అనంత రామారావు తెలిపారు. ట్రస్ట్ భవనంలో జూన్ మొదటి వారంలో ప్రారంభం కానున్న ఈ శిక్షణకు 18 ఏళ్ల నిండి 50 ఏళ్ల లోపు మహిళలు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ట్రస్ట్ భవనంలో మహిళలకు రెండు నెలలు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. విజయవంతంగా శిక్షణ పూర్తి చేసిన మహిళలకు స్కిల్ డవలప్‌మెంట్ ఆఫ్ ఇండియా వారి ద్వారా సర్టిఫికెట్ అందిస్తారన్నారు. అలాగే శ్రీ రాఘవేంద్ర ఛారిటబుల్ ట్రస్ట్ తరపున రూ.8 వేలు విలువైన టేబుల్, మోటార్‌తో పాటు కుట్టు మిషన్ ఉచితంగా అందించనున్నట్లు తెలిపారు. కుట్టు శిక్షణ పొందడానికి ఆసక్తి ఉన్న మహిళలకు శివప్రసాద్ 72075 75616 సంప్రదించాలన్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కి మరమ్మతులు



పాలకొల్లు సబ్బేవారిపేటలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కి మరమ్మతులు చేస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: మండలంలోని పాలకొల్లు రూరల్ పంచాయతీ పరిధిలోని సబ్బేవారిపేటలో 11కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ శనివారం రాత్రి కాలిపోయి విద్యుత్ సరఫరాకి తీవ్ర ఆటంకం ఏర్పడింది. దీంతో గృహ యజమానులకు విద్యుత్ సరఫరాతో పాటు సబ్బేవారిపేట, ధాంపేట తదితర ప్రాంతాలకు మంచినీటి సరఫరాకి తీవ్ర ఆటంకం ఏర్పడింది. దీంతో పంచాయతీ కార్యదర్శి ముచ్చర్ల నాగేశ్వరరావు (చిన్నా) సూచనల మేరకు రూరల్ పంచాయతీ ఎలక్ట్రికల్ సిబ్బంది యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేసి ప్రజలకు మంచినీటిని సరఫరా చేశారు.

రొయ్యో...మొర్రో..

- వాతావరణ మార్పులతో రొయ్య విలవిల
- భారీ పెట్టుబడులతో సాగు
- వైరస్ బారిన రొయ్యలు
- ఆందోళనలో రొయ్య రైతులు



రొయ్యల చెరువులో ఏరియేటర్లు తిప్పుతున్న దృశ్యం

కొత్తపూసలమర్రు వైరస్‌బారిన పడిన రొయ్యలను గ్రేడింగ్ చేస్తున్న రైతులు

భీమవరం అర్బన్: ప్రతి ఏటా ఫిబ్రవరి నుంచి మే నెల వరకు వాతావరణం వనామీ రొయ్యల పెంపకానికి అనుకూలించడంతో రైతులు భారీగా పెట్టుబడులు పెంపకాన్ని సాగిస్తున్నారు. మూడు నెలలు రొయ్య పెంపకం సాగిస్తే పెట్టుబడులు పోనూ కొంత మిగులు రావడంతో రైతులు రొయ్య పెంపకంపై మొగ్గు చూపిస్తున్నారు. అయితే ఇటీవల అకాల వర్షాలు కారణంగా ఆకాశం మబ్బులు పట్టడంతో చెరువులలోని ఆక్సిజన్ శాతంలో హెచ్చుతగ్గులు రావడంతో వనామీ రొయ్యలకు వైరస్ ప్రబలుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భీమవరం మండలంలో దిరుసుమర్రు, గొల్లవానితిప్ప, గూట్లపాడు, కొత్తపూసలమర్రు, అనాకోడేరు, నాగిడిపాలెం, వెంప, తోకతిప్ప, లోసరి, దొంగపిండి తదితర గ్రామాలలో సుమారు 7 వేల ఎకరాల వరకు వనామీ పెంపకాన్ని చేస్తున్నారు. సీజన్‌లో ఆక్వా హబ్‌గా పేరుగాంచిన భీమవరం పరిసర ప్రాంతాలలో రోజుకు సుమారు 100 టన్నులకు పైగా విదేశాలకు ఎగుమతులు జరుగుతున్నట్లు ప్రాథమిక అంచనా. ఈ అమ్మకాల వల్ల కోట్లలో విదేశీమారకద్రవ్యం రాష్ట్రానికి చేకూరుతుంది. ప్రస్తుతం రొయ్యలు సీడ్ దశలోనే ఉన్నాయి.

మృత్యువాత పడుతున్న రొయ్యలు

ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉండి అకాల వర్షాలతో పాటు వాతావరణం మేఘాలు పట్టడంతో చెరువులలోని పీహెచ్, ఆమ్మోనియా, నైట్రోజన్, ఆక్సిజన్ శాతంలలో హెచ్చుతగ్గులు ఏర్పడి రొయ్యలకు వైట్ స్పాట్, విబ్రియో, వైట్‌గట్, తదితర వైరస్ రొయ్యలకు వ్యాప్తి చెంది మృత్యువాత పడుతున్నాయని రైతులు చెబుతున్నారు. ఈ వైరస్‌ల వల్ల 35 రోజుల లోపే రొయ్యలు మృత్యువాత చెంది తీవ్రంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీటిని నియంత్రించేందుకు మందులు వాడినా ప్రయోజనం ఉండటం లేదని రైతులు చెబుతున్నారు.

నిరంతరం ఏరియేటర్లు..

చెరువులలో ఆక్సిజన్‌లో హెచ్చు తగ్గులు నియంత్రించేందుకు ఏరియేటర్లను నిరంతరం తిప్పాల్సి వస్తుందని రైతులు చెబుతున్నారు. దీంతో కరెంట్ ఖర్చు విపరీతంగా పెరుగుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజుకో రకంగా వాతావరణం ఉండటంతో నీటి పరమాణాల్లో హెచ్చు తగ్గులు ఏర్పడి చెరువు నీటిలో బ్యాక్టీరియా పెరిగిపోతుందని చెబుతున్నారు.

నీటి పరిమాణాల్లో జాగ్రత్త అవసరం



అకాల వర్షాలు, వాతావరణంలో మబ్బులు వల్ల రొయ్యల చెరువులో నీటి పరమాణువులైన పీహెచ్, అమ్మోనియా, నైట్రేట్, ఆక్సిజన్ శాతంలో హెచ్చుతగ్గులు వల్ల చెరువుల్లో బ్యాక్టీరియా పెరిగి రొయ్యలకు వైరస్ వ్యాప్తి ఉంటుంది. దీనిని నివారించేందుకు ఎప్పటికప్పుడు నీటి పరీక్షలు చేయించుకోవడం, తరచూ బ్యాక్టీరియా టెస్టులు చేయించి తగు శానిటైజర్లను కొడితే బ్యాక్టీరియా వ్యాప్తిని కొంతవరకు అడ్డుకోవచ్చు.

ఎల్ఎల్ఎస్ రాజు, మత్స్యశాఖ ఏడీ, భీమవరం

పేదలంటే చంద్రబాబుకు ఎప్పుడూ చులకన భావనే



భీమవరంలో చంద్రబాబు దిష్టిబొమ్మతో శవయాత్ర నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

సాక్షి, భీమవరం: పేదల ఇళ్ల నిర్మాణానికి ఏనాడూ గజం స్థలం ఇవ్వని మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పేదల సంక్షేమం కోసం పెద్ద ఎత్తున ఇళ్ల స్థలాలు పంపిణీ చేస్తుంటే ఓర్వలేకనే అవాకులు చవాకులు పేలుతున్నారని భీమవరం వ్యవసాయమార్కెట్ కమిటీ చైర్మన్ కోటిపల్లి బాలకోటేశ్వర రావు (బాబు), ఎంపీపీ పేరిచర్ల విజయనర్సింహరాజు తీవ్రంగా దుయ్యబట్టారు. రాష్ట్ర ప్రభుత్వం పేదల ఇళ్ల నిర్మాణానికి ఇస్తున్న సెంటు స్థలం సమాధులు కట్టుకోడానికి పనికివస్తుందంటూ చంద్రబాబు వ్యాఖ్యలు చేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం భీమవరం ప్రకాశంచౌక్ సెంటర్ భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాబు, విజయనర్సింహరాజు మాట్లాడుతూ చంద్రబాబు 14 ఏళ్ల పాటు ముఖ్యమంత్రిగా పనిచేసినా ఏనాడు పేదల ఇళ్లనిర్మాణానికి గజం స్థలం కూడా ఇవ్వలేదని టిడ్కో ఇళ్ల పేరుతో మహానేత వైఎస్సార్ హయాంలో సేకరించిన ఇళ్ల స్థలాల్లోని పిచ్చుక గూళ్ల మాదిరిగా ఇళ్లు నిర్మించి లబ్ధిదారుల నుంచి పెద్ద మొత్తంలో సొమ్ములు కాజేయడానికి చూశారని దుయ్యబట్టారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టగానే టిడ్కో ఇళ్లు కొంతమందికి ఉచితంగా మిగిలిన వారికి తక్కువ ధరకు ఇచ్చే విధంగా చర్యలు తీసుకున్నారన్నారు. ప్రతి పేదవానికి సొంతింటి కల నిజం చేయడానికి రాష్ట్రవ్యాప్తంగా 30 లక్షల మందికి పైగా ఒకేసారి స్థలాలిచ్చి పెద్ద మొత్తంలో ఇళ్లు నిర్మిస్తుంటే చంద్రబాబు ఓర్వలేకపోతున్నారన్నారు. పేదలంతా జగన్‌కు అండగా నిలవడంతో చంద్రబాబు మతిభ్రమించి మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. పేదలంటే చంద్రబాబుకు ఎప్పుడూ చులకన భావనేనని గతంలో ఎస్సీల్లో పుట్టాలని ఎవరు కోరుకుంటారని చులకనగా మాట్లాడారన్నారు. చంద్రబాబుకు రాజకీయ చరిత్ర ముగిసిందని స్పష్టం చేశారు. ముందుగా చంద్రబాబు దిష్టిబొమ్మతో ప్రకాశంచౌక్ నుంచి అంబేడ్కర్ సెంటర్ మీదుగా శవయాత్ర నిర్వహించి అనంతరం ప్రకాశంచౌక్ సెంటర్‌లో దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు డౌన్‌డౌన్, జై జగన్ అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ తిరుమాని ఏడుకొండలు, రజక కార్పొరేషన్ డైరెక్టర్ రేవూరి గోగురాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు నల్లం రాంబాబు, గాదిరాజు తాతరాజు, మానేపల్లి నాగన్నబాబు, కోడే విజయలక్ష్మి, గొలగాని సత్యనారాయణ, గూడూరి ఓంకారం, గంటా సుందరకుమార్, పేరిచర్ల సత్యనారాయణరాజు, పెచ్చెట్టి ప్రసాద్, గుంటి ప్రభు, నామన మహేష్, తిరుమాని ధనుంజయ, కోళ్ల బాలకృష్ణ, పాలపర్తి జోనా, తాణాల రామకృష్ణ, నల్లం రఘు, తుంపాల సత్తిబాబు, మాదిరెడ్డి శ్రీనివాస్, జవ్వాది సత్తిబాబు, ఎం రామారావు, నూకల కనకరావు తదితరులు పాల్గొన్నారు.

చీఫ్ జస్టిస్ శేషసాయికి సత్కారం



హైకోర్టు చీఫ్ జస్టిస్ ఆకుల శేష సాయికి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

తసాక్షి, భీమవరం: ఏపీ హైకోర్టు తాత్కాలిక చీఫ్ జస్టిస్ గా నియమితులైన ఆకుల శేష సాయిని ఆదివారం భీమవరంలోని ఆయన స్వగృహంలో ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ మర్యాదపూర్వకంగా కలిసి ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భీమవరం అనే పదంలోనే వరం ఉందని, జిల్లాల పునర్విభజన లో భాగంగా పశ్చిమగోదావరి జిల్లా నూతనంగా ఏర్పడడం, ఈ జిల్లాకు భీమవరం కేంద్రం కావడం ఒక వరమైతే, భీమవరానికి చెందిన ఆకుల శేష సాయి హైకోర్టు చీఫ్ జస్టిస్ గా నియమితులు కావడం భీమవరం ప్రజలకే కాకుండా పశ్చిమగోదావరి జిల్లాకే ఖ్యాతి దక్కిందని శ్రీనివాస్ పేర్కొన్నారు. రానున్న రోజుల్లో ఆకుల శేషసాయి మరింత ఉన్నత శిఖరాలను కచ్చితంగా అధిరోహిస్తారని ఇందులో ఎలాంటి సందేహము లేదని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీపీ మారిశెట్టి వెంకటేశ్వరరావు, చెరుకువాడ రంగ సాయి తదితరులు పాల్గొన్నారు.

మొగల్లులో ఘనంగా స్త్రీల సండే



మొగల్లులో నిర్వహించిన స్త్రీల సండేలో గీతాలు ఆలపిస్తున్న విశ్వాసులు

పాలకోడేరు: మొగల్లు సెయింట్ పాల్ లూథరన్ చర్చిలో ఆదివారం స్త్రీల సండే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఆరాధన, పాటలు, వాక్యము చదువుట, ప్రత్యేక ప్రార్థనలు, వాక్య సందేశం, ముగింపు ప్రార్థనలు, కానుకలు పట్టుట అన్ని కార్యక్రమాలు స్త్రీలే నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గోపే జయ పాల్గొని ప్రారంభించి వాక్య సందేశం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బైబిల్ గ్రంథంలోని రూతు, ఎస్తేరు, హన్నా దేవుని మార్గంలో నడిచి దేవుని దీవెనలు పొందారని వారి జీవిత చరిత్రను వివరించారు. స్త్రీలు భర్తకు లోబడి జీవించాలని అన్నారు. స్త్రీలంతా క్రీస్తు మార్గంలో నడవాలని ప్రబోధించారు. ఈ సందర్భంగా ఇవాంజెలిస్ట్ గోపే సాల్మన్ రాజు మాట్లాడుతూ ప్యారిస్ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది స్త్రీలంతా ఐక్యతతో ఈ స్త్రీల సండే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. గ్రామం రాష్ట్రం దేశం గురించి ప్రత్యేక ప్రార్థన జరిపారు. మహిళలు ఆలపించిన గీతాలు ఎంతగానో అలరించాయి. ఈ కార్యక్రమంలో కోనలపల్లి వజ్రం,నేతల శాంత కుమారి, చిల్లా మణికుమారి, పొకెర్ల అమ్మాజీ, వర్ధనపు నాగమణి, మరపట్ల నీలిమ, చిల్లా మార్తమ్మ, కేదాసి చంటమ్మ, చిగురుపాటి జయంతి, బుంగా చలపతి, చిల్లా ఝాన్సీ, కోనలపల్లి సుధారాణి పాల్గొన్నారు.

మావుళ్లమ్మ జ్యేష్ట మాస జాతర ప్రారంభం



అమ్మవారి జ్యేష్ట మాస జాతర ప్రారంభిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణ ఇలవేల్పు శ్రీమావుళ్లమ్మవారి జ్యేష్ట మాస జాతర మహోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. వచ్చే నెల 15వ తేది వరకూ అమ్మవారి జ్యేష్ట మాస మహోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నారు. దీనిలో భాగంగా ఆదివారం అమ్మవారిని నెలబెట్టే కార్యక్రమాన్ని ప్రత్యేక పూజల నడుమ ఘనంగా నిర్వహించారు. ఆలయ సహాయ కమిషనర్ యర్రంశెట్టి భద్రాజి పర్యవేక్షణలో అమ్మవారి ఆలయం వద్ద ఆసాదుల నృత్యాలతో మేళతాళాల మధ్య కార్యక్రమం వైభవంగా సాగింది. 25న గవ్వళ్ల గుడుపు సేవ, 1న గురువారం నైవేద్యాలు, 8న అమ్మవారికి నగరోత్సవం, 14న నైవేద్యాలు అమ్మవారి జ్యేష్ట మాస జాతర సందర్భంగా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈఓ, సహాయ కమిషనర్ యర్రంశెట్టి భద్రాజి తెలిపారు.

దాతలూ..బాలుడిని ఆదుకోరూ..



మంచంపై అచేతనంగా ఉన్న సతీష్ కుమార్

భీమవరం అర్బన్: మండలంలోని కోమటితిప్ప గ్రామంలో ఇరుసుమండ సతీష్ కుమార్ (6) మెదడు నరాల సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ వ్యాధి వల్ల సతీష్ కుమార్ మంచంపైనే అచేతనంగా ఉండటంతో తల్లిదండ్రులు ఇరుసుమండ ఆనందరావు, రూతమ్మలు తమ కుమారిడిని ఆదుకోవాలని అభ్యర్థిస్తున్నారు. కూలి పనులు చేసుకుని వచ్చిన సొమ్ముతో కుటుంబాన్ని నెట్టికొస్తున్న ఆనందరావు తమ కుమారుడు సతీష్ కుమార్ కోసం ఇప్పటి వరకు స్థోమతకు మించి రూ. 10 లక్షలు వరకు ఖర్చు చేశాడు. వైద్యం కోసం విజయవాడలోని రెండు ప్రైవేటు ఆస్పత్రులలో వైద్యం చేయిస్తున్నామని నెలకు రూ.6 వేలు వరకు ఖర్చవుతుందని తెలిపారు. ఈ వ్యాధి నయం అవ్వాలంటే రూ. 10 లక్షలు వరకు ఖర్చు అవుతుందని వైద్యులు చెబుతున్నారని అంత స్థోమత మాకు లేదని దాతలు ముందుకు వచ్చి మానవతా దృక్పథంతో తమ కుమారుడిని ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

సాక్షి, భీమవరం: పట్టణంలోని గొల్లవానితిప్ప రోడ్ లో కొత్తగా 33 కెవి లైన్లు ఏర్పాటు నిమిత్తము 22వ తేది ఉదయం7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు రామలక్ష్మి నగర్, ప్రకాష్ నగర్ ఏరియాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పీర్ అహ్మద్ ఖాన్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఉత్సాహంగా వేసవి విజ్ఞాన శిబిరం

సాక్షి, భీమవరం: పట్టణంలోని డాక్టర్ వైఎస్సార్ ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా ఆదివారం ప్రపంచ సాంస్కృతిక దినోత్సవం, జాతీయ ఉగ్రవాద వ్యతిరేక దినోత్సవం పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కళారంజని నాటక పరిషత్ అధ్యక్షులు జవ్వది దాశరథి శ్రీనివాస్ మాట్లాడుతూ మానవ జాతి ప్రగతికి సంస్కృతికి నిలువుటద్దంలా నిలుస్తుంది అన్నారు.విభిన్న మతాలు, కులాలు, భాషలు, జీవన విధానాలు, కట్టు, బొట్టు, ఆహార వ్యవహారాలతో కూడిన భిన్నత్వంలో ఏకత్వం ప్రదర్శిస్తున్న భారతీయ సంస్కృతి మహోన్నతమైందని తెలిపారు. ప్రతీ రోజు ప్రపంచ విషయాలపై అవగాహన, సంబంధిత అంశాలపై బాలల సందేహాలను నివృత్తి చేయడం లాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో చదువరుల సంఘం అధ్యక్షుడు అరసవల్లి సుబ్రహ్మణ్యం, చెరుకువాడ రంగసాయి, కలిగొట్ల గోపాల శర్మ తదితరులు పాల్గొన్నారు.

రేపు పిల్లలకు ఉచిత గుండె వైద్య శిబిరం

భీమవరం (ప్రకాశంచౌక్): పిల్లల గుండె సంబంధిత వ్యాధులకు సంబంధించి ఉచిత వైద్య శిబిరాన్ని మంగళవారం సాయంత్రం మేంటీవారి తోటలోని, అల్లూరి సీతారామరాజు భగత్ సింగ్ వైద్య సహాయ కేంద్రం (సుందరయ్య భవనం)లో నిర్వహిస్తున్నట్లు వి.రాధాకృష్ణ, వసుధ ఫౌండేషన్ కన్వీనర్ ఇందుకూరి ప్రసాదరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడకు చెందిన పిల్లల గుండె వైద్య నిపుణులు డాక్టర్ కె.విక్రమ్ (ఇంటర్ వెన్షనల్ పీడియాట్రిక్ కార్డియాలజిస్ట్) పిల్లలను పరీశీలన చేసి అవసరమైన వారికి పరీక్షలు నిర్వహిస్తారన్నారు. 15 సంవత్సరాల లోపు వయసు ఉన్న చిన్నారులకు మెడికల్ క్యాంపులో ఉచిత పరీక్షలు, చికిత్సకు వైద్య సహాయం అందిస్తారని తెలిపారు. వైద్య శిబిరాన్ని భీమవరం , భీమవరం చుట్టు పక్కల ప్రాంతాల వారు వినియోగించుకోవాలని కోరారు.

రెండు ద్విచక్ర వాహనాల ఢీ

భీమవరం అర్బన్: భీమవరం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొట్టడంతో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. భీమవరానికి చెందిన కొల్లాటి పెద్దిరాజు రైల్వే డిపార్ట్‌మెంట్‌లో పని చేస్తుంటాడు. నరసింహపురం నుంచి భీమవరం వైపు వస్తుండగా వెనుక నుంచి మరో ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో తీవ్రగాయాల పాలయ్యాడు. బాధితుడు కొల్లాటి పెద్దిరాజు ఫిర్యాదు మేరకు ఎస్సై మోహన్‌రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇరువర్గాల ఘర్షణపై కేసు

భీమవరం అర్బన్: భీమవరం రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం రెండు వర్గాల మధ్య ఘర్షణ ఏర్పడటంతో పోలీసులు కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాలు ప్రకారం బేతపూడిలోని కొత్రపాడుకు చెందిన పైడి రాజేష్‌ను అదే గ్రామానికి చెందిన పాలపర్తి ఏలియాస్ మరో నలుగురు కలిపి కర్రలతో కొట్టి గాయపరిచినట్లు పరస్పరం ఒక వర్గంపై మరో వర్గం ఫిర్యాదు చేసుకోవడంతో రూరల్ ఎస్సై మోహన్‌రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేత్ర వైద్య శిబిరం

యలమంచిలి: మేడపాడు గ్రామంలోని గరువు ప్రాంతంలో ఉన్న శెట్టిబలిజ రామాలయం వద్ద ఆదివారం భీమవరం రాధాకృష్ణ నేత్ర వైద్యశాల సిబ్బంది ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో ఆసుపత్రి సిబ్బంది తలనొప్పి, చత్వారం, కళ్ల మసగ, మెడ నరాలు లాగడం వంటి సమస్యలతో బాధ పడుతున్న 45 మందికి ఉచితంగా కళ్ల పరీక్షలు నిర్వహించారు. వీరిలో 11 మందికి కంటిలో శుక్లాలు ఉండుటతో శస్త్రచికిత్సకు రిఫర్ చేశారు. మరొక 16 మందికి కళ్లజోళ్లు పడతాయని వివరించారు. వీరందరికీ సబ్సిడీపై శస్త్రచికిత్సలు, కళ్లజోళ్లు ఇస్తామని శిబిరం కోఆర్డినేటర్ తెలిపారు.

మానవత సేవలు అభినందనీయం

పెనుమంట్ర: మానవత స్వచ్ఛంద సంస్థ పెనుమంట్ర శాఖ ఆధ్వర్యంలో అనేక స్వచ్ఛందసేవా కార్యక్రమములు చేయడం అభినందనీయమని పెనుగొండ ఎస్వీకేపీ కళాశాల ప్రిన్సిపాల్ కేవీఎస్ఆర్ సూర్యనారాయణ అన్నారు. ఆదివారం మార్టేరులోని రోటరీ భవన్‌లో జరిగిన మానవత సంస్థ సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. స్వచ్ఛంద సంస్థ పేద విద్యార్థులకు, చిరు వ్యాపారులకు తమ వంతు సహకారం అందించి ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా జూనియర్ ఇంటర్‌లో 463 మార్కులు సాధించి ఉత్తమ ప్రతిభ కనబర్చిన పేదవిద్యార్థిని కొవ్వూరి ప్రశాంతికి సంస్థ తరపున రూ.5000 నగదు, రిటైర్డ్ తహసీల్దార్ చిర్ల సూర్యనారాయణ రెడ్డి మరో రూ.2000ల నగదును ఆమెకు సభలో పురస్కారంగా అందించారు. ఈ సందర్భంగా రోడ్డు పక్కన చిరువ్యాపారం చేసుకునే పేదలకు పెద్ద గొడుగులను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా మానవతా సంస్థలో జీవత మెంబర్‌గా రూ.25000 సంస్థకు అందజేసిన ఆంగ్ల ఉపాధ్యాయుడు పడాల అమరనాథరెడ్డిని సంస్థ తరపున ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మానవత సంస్థ అధ్యక్షుడు చిర్ల శ్రీనివాసరెడ్డి, డాక్టర్ పోడూరు కృష్ణమూర్తి , కార్యదర్శి బానాల శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు జె.దుర్గారావు, యోగా మాస్టర్ పడాల రామచంద్రారెడ్డి, జిల్లా కన్వీనర్ కొత్త సత్యనారాయణమూర్తి, పూర్వ అధ్యక్షుడు కడలి సుబ్రహ్మణ్యం, సహాయ కార్యదర్శి బండి ప్రసాద్, రిటైర్డ్ ఎమ్మార్వో తామాడ సత్యనారాయణ, బాస్కెట్ బాల్ అసోషియేషన్ జిల్లా అధ్యక్షుడు కర్రి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ ఆలయంలో భక్తుల రద్దీ

మొగల్తూరు: ముత్యాలపల్లిలో ఉన్న శ్రీబండి ముత్యాలమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు భారీగా తరలి వచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి తమ మొక్కులు తీర్చుకునేందుకు భక్తులు రావడంతో అమ్మవారి ఆలయం కిటకిటలాడింది. పాలకొల్లుకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు గుణ్ణం నాగబాబు ఆయన కుటుంబ సభ్యులు అమ్మవారిని దర్శించుకుని పూజలు జరిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగుకుండా ఆలయ కమిటీ చైర్మన్ కొల్లాటి రామారావు, ఈఓ డి.రామకృష్ణంరాజు ఏర్పాట్లను పర్యవేక్షించారు. అలాగే సోమవారం అమ్మవారి హుండీ ఆదాయాన్ని లెక్కిస్తామని వారు తెలిపారు. హుండీ లెక్కింపులో పాల్గొనే భక్తులు తమ పేర్లను కార్యాలయంలో నమోదు చేసుకోవాలని కోరారు.